క్లుప్తంగా

మద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్ సర్టిఫికెట్లపై విచారణ

పాణ్యం: మద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.బాబు ఉన్నతాధికారులకు సమర్పించిన పదో తరగతి సర్టిఫికెట్లపై ఫిర్యాదు రావడంతో విచారణ చేపడుతున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ విద్యాభ్యాసానికి సంబంధించి పలు ఫిర్యాదు అందడంతో వీటిపై విచారణ చేసి నివేదిక అందించేందుకు అధికారులను నియమించామన్నారు. నివేదిక రాగానే ఉన్నతాదికారులకు పంపుతామని చెప్పారు.

విద్యార్థుల మెరిట్ జాబితా విడుదల

ఓర్వకల్లు: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ జోషులా వాట్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లితండ్రుల సౌలభ్యం కోసం జాబితాను పాఠశాల ఆవరణలో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారి జాబితాను పరిశీలించుకోవాలన్నారు.

నేడు రామాయణ ప్రవచనాలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డులోని ముజఫర్‌నగర్‌లో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం రామాయణ ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త చిలుకూరు ప్రతాప్ శుక్రవారం తెలిపారు. ఇంటాక్ లైఫ్ మెంబర్ డాక్టర్ గుంటూరు సుబ్బరామయ్య ప్రవచనాలు వినిపిస్తారన్నారు. కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రామాయణాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలయ్య, శ్రీరాములు, భాస్కర్, అంబాజీరావు, గౌరమ్మ, ఉమామహేశ్వరి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి

కల్లూరు : పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉలిందకొండ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుచున్న కిశోరి వికాస కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలందరి ఎత్తు, బరువు తీసి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు అందుబాటులో లభించే పోషక విలువలతో ఉన్న ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర వాటిని రోజు వారీ ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు నాగరాజు, మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త ప్రశాంతి, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్ట నిస్ట్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.


శుభకార్యం

సి.బెళగల్: మండల కేంద్రంలోని బోయవీధిలో జరిగిన వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందు కుమారుడు మద్దిలేటి వివాహ ఆహ్వానం మేరకు.. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండల నాయకులతో కలిసి సి.బెళగల్ గ్రామానికి చేరుకుని పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఓర్వకల్లు: మండలంలోని పలు చోట్ల శుక్రవారం గాలివానకు చెట్లు, పండ్ల తోటలు నేలకొరిగాయి. ఇందులో భాగంగా స్థానిక స్టీల్ ప్లాంట్ రోడ్డులో నిర్మించిన విద్యుత్ స్తంభాలలో ఒకటి విరిగి పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ సునీల్‌బాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. దీంతో సాయంత్రం మండలంలోని ఓర్వకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సివచ్చింది. రాత్రి 8.30 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రాయలసీమ డిక్లరేషన్ ఎక్కడ?



ధర్నా చేస్తున్న రాయలసీమ ఉద్యమకారులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ×మిషన్ రాయలసీమ.. రాయలసీమ డిక్లరేషన్లన్‌ను ఎప్పుడు అమలు చేస్తాయని కర్నూలు డెవలప్‌మెంట్ ఫోరం, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ప్రశ్నించాయి. శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు డెవపల్‌మెంట్ ఫోరం కన్వీనర్ మోహన్ కడింపల్లి, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, టీడీపీ జనసేన పార్టీలు రాయలసీమకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. అప్పులు చేసి కేవలం అమరావతికే సంపద పెట్టడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. కర్నూలులో హైకోర్టు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సత్యనారాయణ గుప్తా, శేఖర్ పపోతుల, పాలకొమ్మ అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- పాణ్యం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర డబుల్‌లైన్
- ప్రతిపాదనలు పంపిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఆమోదం తెలుపుతూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు
- త్వరలో టెండర్లు



విస్తరణ జరగనున్న పాణ్యంలోని ప్రధాన వీధి

పాణ్యం: మండల కేంద్రంలో ప్రధాన రహదారులు ఇరుకుగా ఉండడంతో నిత్యం వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో వైఎస్సార్ విగ్రహం నుంచి 4కిలోమీటర్ల మేర డబుల్‌లైన్ పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా.. వాటికి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే అధికారులు కొలతలు వేసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు హద్దులను గుర్తించారు. దాదాపుగా రూ. 2.50కోట్లతో ప్రతిపాదనలు పంపగా వాటికి ఆమోదం తెలుపుతూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

7 మీటర్ల వెడల్పుతో రోడ్డు

పాణ్యంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి కొణిదేడు గ్రామ సమీపం వరకు నాలుగు కిలోటమీర్ల దూరం వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డుకు బదులు డబుల్ లైన్ పనులు చేపట్టనున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదించిన లెక్కల ప్రకారం ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నా వాటిని తొలగించి రోడ్డు వేయనున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర బీటీ(తారు) 7మీటర్ల వెడల్పుతో డబుల్‌లైన్ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న జుర్రాగుపై ఉన్న వంతెనకు మరమ్మతులు కూడా చేయనున్నారు. అలాగే చెరువు కట్ట చుట్టూ డబుల్ లైన్ రోడ్డుకు అనువుగా ఉండేలా, కట్ట వద్ద ఉన్న వంపులను సైతం తగ్గించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ఆక్రమణలపై దృష్టి

ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న స్థలాలలో ఏమైనా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించి డబుల్ లైన్ పనులు చేయనున్నారు. ఇది వరకే ఆర్‌అండ్‌బీ అధికారులు కొలతలు వేసి తమ హద్దులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలీసు స్టేషన్ నుంచి పాణ్యం వరకు ఉన్న బీటీ రోడ్డును మరింత వెడెల్పు చేస్తూ.. పాత ఆసుపత్రి నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు కూడా 7 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది

పాణ్యం నుంచి కొణిదేడు గ్రామం సమీపం వరకు నాలుగు కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపగా వాటికి ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ పనుల కోసం రూ.2.50కోట్లు మంజూరు చేశారు. ఉన్న రోడ్డును వెడల్పు చేస్తూ డబుల్ లైన్ రోడ్డును వేసేందుకు ప్రతిపాదనలుకు ఆమోదం వచ్చింది. టెండర్లు పూర్తి కాగానే పనులు చేపడతాం. ఆక్రమణలు ఉంటే వాటిని అన్ని శాఖల సమన్వయంతో తొలగించి పనులు చేపడతాం.

– వెంకటేశ్వరరెడ్డి ఆర్‌అండ్‌బీ ఏఈ

బిర్లా సర్కిల్‌కు కొత్త శోభ



బిర్లా సర్కిల్‌లో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలు

కర్నూలు(అర్బన్): నగరంలోని బిర్లా సర్కిల్ కొత్త శోభ సంతరించుకుంది. ఈ సర్కిల్‌లో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలనే ఆకాంక్షతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఈ విగ్రహాలను తెప్పించారు. అయితే ఈ సర్కిల్‌లో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేసి ఆయన సతీమణి సావిత్రీబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం కొంత జాప్యాన్ని ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా సావిత్రీబాయి విగ్రహం సంక్షేమ భవన్‌లోనే ఉండింది. కాగా, గత నెల 11న జరిగిన జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఈ సర్కిల్‌లోనే సావిత్రీబాయి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని పలువురు బీసీ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం సావిత్రీబాయి విగ్రహాన్ని భర్త జ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే ఏర్పాటు చేశారు. స్ఫూర్తి ప్రధాతలైన పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయడంతో ఈ సర్కిల్ ప్రజలను ఆకర్శిస్తోంది.

గ్రామాల్లో ప్రశాంతతకు సహకరించండి



ఎస్‌ఐ పరమేష్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల ప్రశాంతతకు సహకరించాలని ఎస్‌ఐ పరమేష్ నాయక్ కోరారు. శుక్రవారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యవర్గ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ పరమేష్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మండల నాయకులతో మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి, ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పల్లెల్లో అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు ప్రజలకు నేతలు అవగాహన కల్పించి, తగాదాలు లేకుండా చూడాలని, చట్ట పరిధిలోని అంశాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ సూచించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు ముల్ల హరున్, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, సర్పంచ్ పాండురంగన్న, కార్యదర్శులు మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, ఎర్రన్న, ఎస్‌ఎం బాష, రాఘవేంద్ర, రామాంజనేయులు, లచ్చప్ప, తెలుగు దస్తగిరి తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు ఈ–శ్రమ్ కార్డులు



ఈ–శ్రమ్ కార్డులపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు ఈ–శ్రమ్ కార్డులను అందజేస్తున్నట్లు అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న తెలిపారు. శుక్రవారం కోడుమూరులో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్‌బాషాతో కలిసి అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న సందర్శించి కూలీలకు ఈ–శ్రమ్ కార్డులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడికక్కడే 120 మంది కూలీలకు ఆధార్ కార్డు వివరాల ఆధారంగా ఈ–శ్రమ్ కార్డులను అందజేశారు. కేశన్న మాట్లాడుతూ కూలీలంతా ఈ–శ్రమ్ కార్డులను తీసుకోవాలని, తద్వారా ఉచితంగా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని కూలీలందరూ ఈ–శ్రమ్ కార్డుల కోసం ఆయా మేటీల వద్ద పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


రీసర్వేపై అభ్యంతరాలుంటే తెలపండి



రైతులకు సర్వే వివరాల నోటీస్‌లను ఇస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రంలో చేపట్టిన భూముల రీసర్వేలో ఏవైనా సమస్యలు, తప్పులు ఉంటే రైతులు అభ్యంతరాలను తెలుపవచ్చని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. గ్రామంలో నిర్వహించిన రీసర్వే పనులు పూర్తి కావడంతో శుక్రవారం వీఆర్వోలు, సర్వే సహాయకులు సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. గ్రామ పాత బస్టాండ్‌లో నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌చార్జ్ తహసీల్దార్, మండల సర్వేయర్ నాగభూషణం గ్రామంలో నిర్వహించిన రీసర్వే అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే సిబ్బంది చేపట్టిన అంశాలను రైతులకు 9(2) నోటీస్‌ల ద్వారా కొలతల వివరాలను తెలియజేయడం జరుగుతుందని, అందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే గ్రామ రెవెన్యూ అధికారులకు (వీఆర్వోలకు), గ్రామ సర్వే సహాయకులకు అర్జీ రూపంలో తెలియజేస్తే విచారించి, తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు 9(2) నోటీస్‌లు (సర్వే కొలతల వివరాల పత్రాలు) పంపిణీ చేశారు. ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు వెంకటేష్, గౌరి, సాయిరమణ, సర్వే సహాయకులు వేణుగోపాల్ నాయుడు, తిరుమల నాయుడు, రైతులు ఉన్నారు.

విశ్వంలోని రహస్యాలను శోధించడమే సైన్స్



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): విశ్వంలోని రహస్యాలను శోధించడమే సైన్స్ అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాలులో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలైన అక్షరాస్యత, సారా ఉద్యమం, పొదుపు, మహిళా సాధికారత తదితర అంశాలపై జన విజ్ఞాన వేదిక పనిచేసిందన్నారు. రాబోయే కాలంలో యువత, అలవాట్లు, విద్య, ఆరోగ్యం, సైబర్ నేరాలు వంటి రంగాల్లో పనిచేస్తుందన్నారు. రాష్ట్ర మహాసభలు జులై నెలలో కడప లేదా ఒంగోలులో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచేందుకు సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కోశాధికారి సనా ఉల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరగాలంటే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమార్కెట్ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో సెలవులను వృథా చేయకుండా ఏదైనా క్రీడాంశాన్ని ఎంచుకొని నిత్య సాధన చేయాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ తైక్వాండోలో ఉచిత శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కరాటే శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

కర్నూలు(హాస్పిటల్): డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సునకు డిగ్రీ పాస్/ఫెయిలైన విద్యార్థులు కూడా అర్హులన్నారు. అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సుండాలన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఈ కోర్సు పూర్తయిన అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కోర్సులో చేరాలనుకునే వారు 93922 51434, 79950 13422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కర్నూలు నగరం జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న బొల్లినేని మెడిస్కిల్స్‌లో సంప్రదించాలని సూచించారు.

అన్న క్యాంటీన్లపై ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు (టౌన్): నగరంలోని అన్ని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. శుక్రవారం స్థానిక పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఆహారం రుచి గురించి ఆరా తీశారు. ప్రతి అన్న క్యాంటీన్ వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీన్ని స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ప్రజల సూచనల ఆధారంగా అన్న క్యాంటీన్‌లను మరింత మెరుగు పరిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

సెల్‌ఫోన్ డీఅడిక్షన్‌పై శిక్షణ

కర్నూలు (హాస్పిటల్): సెల్‌ఫోన్ డీఅడిక్షన్‌పై విద్యార్థులకు రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కృష్ణకాంత్ ప్లాజాలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రముఖ మేథమెటిక్స్ స్కిల్స్ అకాడమీ (హైదరాబాద్) సంస్థ డైరెక్టర్ చంద్రయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు నేరుగా హాజరుకావచ్చన్నారు.

ఉచితంగా దంత వైద్య పరీక్షలు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని అరోరా నగర్‌లో ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం ఆవరణలో శుక్రవారం ఉచిత దంత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది శ్రీధర్ ఆధ్వర్యంలో ఏఆర్‌జేఎస్ కేర్ సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి దంత వైద్యులు డాక్టర్ రాజ జగదీశ్ కుమార్, డాక్టర్ దివ్యా రెడ్డి చికిత్స అందించారు. అనంతరం వారికి మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు.

రమణీయం.. సాయినాథుడి రథోత్సవం



అశేష భక్తజనం మధ్య సాగుతున్న సాయినాథుడి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి మహా రథోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎంతో వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా సాయినాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనుల చేసి గ్రామ వీధుల గుండా రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా కోడుమూరు పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సలహాదారు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహ న డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాలుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి రూ.8800 వేతనం ఇస్తున్నారని, ఇది ప్రస్తుత ఖర్చులకు ఏ మాత్రం సరిపోదని, యాజమాన్యం సరైన సమయానికి పీఎఫ్ చెల్లించడం లేదని, అయితే ఉద్యోగుల నుంచి మాత్రం వసూలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశా రు. అంతేకాక ఉద్యోగులకు వీక్లీ ఆఫ్‌లు, జాతీయ సెలవు దినాలను అమలు చేయడం లేదని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమాను అమలు చేయాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు, వాహనాలు రిపేర్లు వచ్చినప్పుడు యాజమాన్యమే భరించాలని కోరారు. అనంతరం డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి లోకేష్, ట్రెజరర్ నరేంద్రరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

గుంతలమయంగా మారిన కొల్లంపల్లితండా రోడ్డు



దారంతా గుంతలమయం

కల్లూరు : ఉలిందకొండ మజరా గ్రామం కొల్లంపల్లితండాకు వెళ్లే దారంతా గుంతలమయంగా మారింది. ఉలిందకొండ నుంచి కొల్లంపల్లితండాకు సుమారుగా నాలుగు కిలోమిటర్ల దూరం ఉంటుంది. దారంతా గుంతలు ఉండడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డు మొత్తం ధ్వంసం అయి కంకర తెలడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రోడ్డును వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పంచలింగాల గ్రామం సుంకులమ్మ ఆలయ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందే పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగునీటి వల్ల దోమలు, విషకీటకాల బారిన పడి ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. సమస్యపై ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పంచలింగాలలో ఇళ్ల ముందు పారుతున్న మురుగు